

బాగ్‌అంబర్‌పేటలో రూ.5 భోజన కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి తదితరులు

విద్యార్థుల కోసం భోజన కేంద్రం ఏర్పాటు

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగాల కోసం గ్రూప్-2 పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు రూ.5 భోజన కేంద్రం వంటివి దోహదపడతాయని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని ఇంద్రప్రస్థ కాలనీలోని లైబరీలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ప్రత్యేకంగా రూ.5 భోజన కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేక భోజన కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



భోలక్‌పూర్ బడీ మసీదులో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మొదటి శుక్రవారం సామూహిక ప్రార్థనలు

ముషీరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో మొదటి శుక్రవారం ముస్లింలు మసీదులకు తరలివెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. దీంతో పరిస ప్రాంతాలు, మసీదులు కిక్కిరిసిపోయాయి. భోలక్‌పూర్ బడీ మసీదులో సుమారు 5 వేల మంది సామూహిక ప్రార్థనలు చేశారని మసీదు ముత్తవల్లి నజీర్ అలీ తెలిపారు. కొంత మంది ఉపవాస దీక్షలు సైతం సాయంత్రం మసీదులో విరమించారు. మొదటి శుక్రవారం కావడంతో చిన్నా, పెద్ద తేడా లేకుండా పెద్ద ఎత్తున ముస్లింలు తరలిరావడంతో నియోజకవర్గంలోని ప్రాధాన 36 మసీదుల వద్ద జనం, వాహనాలతో కిక్కిరిసిపోయాయి.

తెలంగాణ అడవులపై బీజేపీ కన్ను

● మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ

నల్లకుంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పలు ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేసిన బీజేపీ తెలంగాణపై కన్నేసిందని, అందులో భాగంగానే ఆదివాసులను హింసిస్తూ అడవిలో అత్యంత విలువైన సంపదను ఆదానీ, అంబానీలు, గుజరాత్ వ్యాపారులకు అమ్మడానికి కొత్త నాటకానికి తెరలేపారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ ఆరోపించారు. శుక్రవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండుమార్లు బాధ్యతలు నిర్వర్తిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి ఎన్ని కోట్లు కేంద్రం నుంచి తీసుకువచ్చారని ప్రశ్నించారు. దేశంలోని భూమి, విలువైన ఖనిజాలు తమ పార్టీకి వేల కోట్లు ఇస్తున్న గుజరాత్ వ్యాపారుల కోసం నేడు తెలంగాణ అడవులు ఆదివాసి ప్రజలపై కిషన్‌రెడ్డి కన్నేసినట్లు ఉందని విమర్శించారు. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు వాస్తవం గుర్తించి కేంద్రంలోని బీజేపీకి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు.



గోల్నాక డివిజన్ కమలానగర్‌లో ఉన్న ప్రభుత్వ భూమి

ప్రభుత్వ భూమిని కాపాడండి: కార్పొరేటర్

గోల్నాక, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ కమలానగర్‌లోని మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జాదారుల నుంచి కాపాడి ప్రజలకు ఉపయోగ పడేవిధంగా పార్కు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతూ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేస్తూ రిజిస్టర్ పోస్ట్‌ద్వారా లేఖను పంపించారు. కమలానగర్‌లోని మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జాచేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఆ భూమి కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని సీఎంను ఆమె కోరారు. కొంతమంది నాయకుల అండదండలతో ఆ భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. ఈ స్థలంలో పార్కును, మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణం చేసి పేదలకు మేలు చేసేవిధంగా చర్యలు తీసుకునేలా అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని సీఎంను ఆమె కోశారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం



పులిగిల్ల జాని

రాంనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ ఆటోడ్రైవర్ అదృశ్యమయ్యాడు. ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... పీఎస్ పరిధిలోని విద్యానగర్ టీఆర్‌టీ కాలనీలో నివాసం ఉంటున్న పులిగిల్ల జాని (35)కి భార్య నాగలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. ప్రతిరోజు స్కూల్ పిల్లలను ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్, ఇంటికి తీసుకోస్తున్నాడు. రాత్రి వేళల్లో ఆటో నడిపిస్తున్నాడు. ఈ నెల 6వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో ఆయనకు ఫోన్ రావడంతో ఆటో తీసుకుని బయటకు వెళ్లాడు. ఆ రోజు రాత్రి నుంచి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో అతని స్నేహితులు, కుటుంబ సభ్యుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆయన భార్య నాగలక్ష్మి శుక్రవారం నల్లకుంట పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ జగదీశ్వర్ పర్యవేక్షణలో పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు నల్లకుంట పోలీసులకు గానీ లేదా 9014509552 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరాలని కోరారు.

నల్లకుంటలో ఓ యువతి...



జమున

రాంనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువతి అదృశ్యమైంది. నల్లకుంట పీఎస్ ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... నల్లకుంట డాక్టర్ చారీ వీధిలోని మూన్‌కేఫ్ సమీపంలో వెంకన్న ఆటోడ్రైవర్ నివాసం ఉంటున్నారు. వారితో పాటు అతని మరదలు కుమార్తె పులిమామిడి జమున (19) ఉంటున్నారు. జమున శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వెంకన్న నల్లకుంట పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆమె కోసం గాలిస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు నల్లకుంట పీఎస్‌లో నేరుగా గానీ లేదా 9908652309 ఫోన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

రైలులో గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

బర్కత్‌పుర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో గుండెపోటుతో ఓ ప్రయాణికుడి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... కడప జిల్లాకు చెందిన బి.నారాయణ(52) భార్య, బంధువులతో కలిసి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వస్తున్నాడు. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో జనరల్ బోగిలో ఉన్న నారాయణకు గుండెపోటు వచ్చి మృతి చెందాడు. రైలు కాచిగూడ రైల్వే స్టేషన్‌లో 5వ ప్లాట్‌ఫారంలో ఆగిన తర్వాత నారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళలు మహారాణులు

ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలు అందిస్తూ.. బాధ్యత గల గృహిణులుగా ఎదుగుతూ..



రాంనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జనాభాలో సగ భాగంగా ఉన్న మహిళలు పురుషులతోపాటు అన్ని రంగాల్లో పోటీపడుతూ ఎదుగుతున్నారు. అన్ని రంగాలలో రాణిస్తూ తమ సొంత కాళ్లపై నిలబడి ఆర్థిక స్వాలంబనవైపు పరుగులు తీసుకున్నారు కొంతమంది మహిళలు, మరికొంత మహిళలు ప్రభుత్వ ఉద్యోగాలు నిర్వహిస్తూ అందరి మన్ననలందుకుంటున్నారు. ఇంకొంత మంది మహిళలు ప్రభుత్వ ఉద్యోగాలు రాకున్నా నిరుత్సాపడకుండా స్వయం ఉపాధి, వృత్తివిద్యా కోర్సులను నేర్చుకుని ప్రత్యేకంగా వ్యాపారాలు నిర్వహిస్తూ పదిమందికి ఉపాధి కలిస్తూ అబల కాదు, సబల అనిపించుకుంటున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలకు చెందిన మహిళల అభిప్రాయాలు



జెమిస్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ సునీతను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి

కుటుంబానికి అండగా ఉంటున్నా



తల్లి స్ఫూర్తితో చిన్నప్పుడు కుట్లు, అల్లికలు నేర్చుకున్నా, నేడు రాంనగర్‌లో హై ఫ్యాషన్ బోటీక్యూ నిర్వహిస్తూ నేను నా కాళ్లపై నిలబడి పదిమందికి ఉపాధి కల్పిస్తూన్నా. కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే తాను నేర్చుకున్న విద్యను వృథా కాకుండా నా అనుభవాన్ని మహిళలకు పంచుతున్న

-ఎస్.పద్మలత, డిజైనర్

మహిళలు ఉన్నత స్థానానికి చేరాలి



సమాజంలో మహిళలకు లభిస్తున్న అవకాశాలను ఉపయోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి. చేసే పనిలో ఆత్మ విశ్వాసం కలిగి ఉండాలి. సమాజంలో అన్ని రంగాలలో మహిళలు తమ ప్రతిభాపాటవాలను కనబర్చడం అభినందనీయం.

- పీరాబాయి, అంబర్‌పేట తహసీల్దార్

అన్ని రంగాల్లో రాణించాలి



ప్రస్తుత సమాజంలో పురుషులతో పాటు అన్ని రంగాల్లో మహిళలు రాణించాలి. అప్పుడే సమాజంలో మహిళలకు సరైన గౌరవం లభిస్తుంది. ఏ రంగంలోనైనా తమ ప్రతిభను ప్రదర్శించినప్పుడే మహిళలు తమవంతు పాత్రను ప్రదర్శించాలి. రాజకీయ, విద్య, సాంకేతికతోపాటు అన్నింటిపై దృష్టి సారించాలి.

- రాధ, కండక్టర్, మిథాని డిపో

విద్యతోనే మహిళల అభివృద్ధి



మహిళలు విద్యతోనే అభివృద్ధి సాధిస్తారు. గతంలో నిరక్ష్య రాస్యత వల్ల మహిళలు వెనబడిపోయేవారు. నేడు పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారు. ప్రతిరంగంలో మహిళలు తమ ఆదితపత్యాన్ని కొనసాగిస్తున్నారు. అక్షరాస్యతలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. ఉన్న అవకాశాలను సద్వినిగియోగం చేసుకొని కష్టపడి చదవి ఉన్నత స్థానాలకు ఎదగాలి.

- డి. సుప్రజ, దోమలగూడ వాటర్‌వర్క్స్ మేనేజర్

సర్వీస్ మొత్తం పిల్లలకే అంకితం



పిల్లలు బాగుండాలనే తపనతో జీవితం మొత్తం వారికే అంకితం చేశాను. 1992లో టీచర్‌గా బాధ్యతలు చేపట్టి అంచెలంచలుగా ఎదుగుతూ ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలుగా, ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్‌గా విధులు నిర్వహిస్తున్నారు. టీచర్‌గా బ్యాధలు నిర్వహిస్తునూ కుటుంబం భారం మోస్తున్నాను.

- స్వరూపారాణి, ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోస్

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి



మహిళలు తమకు ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హింసపై అప్రమత్తంగా ఉంటూ వాటిని ఎదుర్కొని ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలి. ఎలాంటి సమస్యలనైనా ఏకాగ్రతతో పరిష్కరించాలి

- మౌనిక, ఎస్ఐ, అంబర్‌పేట పీఎస్

మహిళాసాధికారతతోనే సమాజ అభివృద్ధి



మహిళా సాధికారతతోనే సమాజం కుటుంబం అభివృద్ధి చెందుతుంది. మహిళలు విద్యావంతులైతేనే కుటుంబం అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదుగుతుంది. నేడు మహిళలు అన్ని రంగాలలో తమ ప్రతిభ కనబరుస్తున్నారు. విద్యతోనే ఉన్నత స్థాయికి ఎదుగుతామన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉండాలి

- శాంతి, దోమలగూడ ఎస్ఐ



మహిళా దినోత్సవం సందర్భంగా సీఐటీయు ఆధ్వర్యంలో ర్యాలీ

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న మహిళా ఉద్యోగులు



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన నరేందర్ యాదవ్, శ్రీనివాస్, రతన్ తదితరులు

కవాడిగూడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం మరింత విస్తరించాలని అప్పుడే సమాజం సంపూర్ణ అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. మహిళల సాధికారత హక్కుల సాధన కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కోదండరాం హాజరై మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే మహిళలలో సాధికారత, ఆత్మాభిమానం పెరిగాయని ఇది శుభ పరిణామమన్నారు.

ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో

ముషీరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకోని శుక్రవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు పూలబొకేలు, బహుమతులు అందజేసి అభినందించారు. ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఎవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు జయలత, అనిత, పద్మావతి, అలివేలు మంగలను స్కూల్ ఉపాధ్యాయులు నరేందర్‌యాదవ్, శ్రీనివాస్ రతన్‌లు సన్మానించారు.

భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో

రాంనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థిక ప్రగతి సాధించాలని భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ వ్యవస్థాపకులు టి.ఎస్.వి.ప్రసాద్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, మహిళా విభాగం చైర్‌పర్సన్ కె.ఎస్.సుఫల అన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మహిళలను సత్కరించారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం

చిక్కడపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని సిటీ సెంట్రల్ లైబ్రరీ చైర్మన్ కేసి రెడ్డి ఉపేందర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చిక్కడపల్లిలోని సిటీసెంట్రల్ లైబ్రరీలో జరిగిన కార్యక్రమంలో లైబ్రరీ కార్యదర్శి పొట్లూరు పద్మజ, చంద్రకళ, సునీత, అమరావతి, యాదమ్మ, భాగ్యలక్ష్మి తదితర మహిళా ఉద్యోగినులను ఆయన సన్మానించారు.

మహిళా సాధికారతకు పెద్దపీట



చిక్కడపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు పెద్దపీట వేసినట్లు గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆమె కార్పొరేటర్ కార్యాలయంలో మాట్లాడుతూ ముఖ్యంగా మహిళల కోసం అనేక పనులు జరిపించినట్లు తెలిపారు. వీవీ గిరినగర్, చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్ మహిళాభవన్‌లలో ఉచితంగా మహిళలకు మగ్గంవర్క్, టైలరింగ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీఐటీయు హైదరాబాద్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు, బాలికలకు రక్షణ కల్పించాలని కోరుతూ గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు ర్యాలీ నిర్వహించారు.

కాచిగూడ సీఐగా జ్యోత్స్న

బర్కత్‌పుర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ పీఎస్ సీఐగా జ్యోత్స్న తల్లోజు శుక్రవారం రాత్రి పదవీ బాధ్యతలు చేపట్టారు. 2004 బ్యాచ్‌కు చెందిన జ్యోత్స్న సెంట్రల్ జోన్ మహిళా పీఎస్ ఎస్‌హెచ్ఓగా పనిచేసి కాచిగూడ పీఎస్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా ముం దుకుసాగుతానని తెలిపారు. రంజాన్, ఉగాది, శ్రీరామనమి వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలని ఆమె కోరారు. ఈ విషయంలో పీస్ కమిటీ, ఆలయ కమిటీ నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి ఉత్సవాలు పండుగలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని వర్గాల ప్రజలను ఆమె కోరారు. అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆమె హెచ్చరించారు.



విద్యార్థులకు బ్యాగులు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేస్తున్న బండారు వైష్ణవ్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ బండారు విజయలక్ష్మి

సామాజ సేవలో స్వచ్ఛంద సంస్థలు పాల్గొనాలి

● బండారు విజయలక్ష్మి

రాంనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో స్వచ్ఛంద సంస్థలు పాల్గొని సేవ చేయాలని బండారు వైష్ణవ్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ బండారు విజయలక్ష్మి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు చేయూత కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని జెమిస్తాన్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బండారు వైష్ణవ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారికి బ్యాగులు, వాటర్ బాటిల్స్, పెన్నులు, పెన్సిల్స్, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె పాల్గొని మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా తమ సంస్థ ఆధ్వర్యంలో ముషీరాబాద్ నియోజకవర్గంలో ఉచిత వైద్య శిబిరాలు, మహిళలకు ఉపాధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్, మాజీ అధ్యక్షుడు ఆర్.నరేష్, మోహన్, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరిదికి వినతిపత్రం అందజేస్తున్న బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి తదితరులు

మోహిన్‌చెరువు సమస్యను పరిష్కరించాలి

● కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

రాంనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని మోహిన్ చెరువు, వర్షం నీరు వల్ల మల్లికార్జున్‌నగర్‌లో తీవ్ర ఇబ్బందులు నెలకొన్న ప్రమాదం నేపథ్యంలో ఎస్ఎల్‌పీడీ పనులను త్వరగా ప్రారంభించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరిదికి కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షా కాలంలో మోహిన్ చెరువు నీరు మల్లికార్జున్‌నగర్‌లోకి వచ్చి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరామన్నారు. ఇందుకు స్పందించిన కమిషనర్ ఈ సమస్యలు, ఇతరత్ర వాటిపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు.



కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి విజయదుందుబి మ్రోగించిన అంజిరెడ్డిని, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని బీజేపీ గోల్నాక డివిజన్ నాయకులు శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. -గోల్నాక, ఆంధ్రజ్యోతి



ముషీరాబాద్‌లో నీట్ పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

నీట్ పరీక్షా కేంద్రాల పరిశీలన

ముషీరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న నీట్ పరీక్ష కేంద్రాలను నీట్ బృందం ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీంచారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలతో పాటు స్థానికంగా ఉన్న వివిధ పాఠశాలలను సందర్శించి తరగతి గదుల్లో గాలి, వెలుతురు, నీరు, మరుగుదొడ్ల సౌకర్యం తదితర వాటిని స్కూల్ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పరిశీలించిన వారిలో ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, నోడల్ ఆఫీసర్ గంగాధర్, సికింద్రాబాద్ విద్యామండలి డిప్యూటీ ఈవో శ్రీధర్, సీఐ సీతయ్య పాల్గొన్నారు.



7ఎఎంబి51: సీపీఎఫ్‌సీ కమిషనర్ రమేష్‌కృష్ణమూర్తికి వినతిపత్రం సమర్పిస్తున్న ఆర్.కృష్ణారావు తదితరులు

పెన్షనర్స్‌కు క్యాష్‌లెస్ బెనిఫిట్స్ ఇవ్వాలి

● భవిష్యనిధి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ

బర్కత్‌పుర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్స్‌కు క్యాష్‌లెస్ బెనిఫిట్స్ ఇవ్వాలని భవిష్యనిధి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఆర్.కృష్ణారావు, కార్యవర్గ సభ్యులు కె.ఛాయాదేవి, ఎస్.లక్ష్మణ్‌రావు, బి.రమేష్ కుమార్‌లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నగరానికి వచ్చిన సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ చీఫ్ కమిషనర్ (సీపీఎఫ్‌సీ) రమేష్‌కృష్ణమూర్తిని కలిసి వినతిపత్రం సమర్పించినట్లు వారు తెలిపారు. లక్ష రూపాయల ఎంవోయూ ఫస్ట్ అమలులో ఉందని, దీనిని రద్దు చేయాలన్నారు. మెడికల్ బిల్లులను పూర్తి స్థాయిలో చెల్లించాలని, ప్రస్తుతం బిల్లులను తగ్గించి ఇస్తున్నారని, సీఎస్ఎంఏ చట్టం ప్రకారం ఈ హెల్త్ స్కీమ్‌ను అమలు చేయాలని వారు కోరారు. కమ్యుకేషన్ పిరియడ్ ప్రస్తుతం 15 ఏళ్ల ఉందని, దానిని 10 సంవత్సరాల 8 నెలలకు కుదించాలని కోరారు. నోషనల్ ఇంక్రిమెంట్ జూన్ 30 నుంచి డిసెంబర్ 31 వరకు రిటైర్డ్ అయిన వారికి అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పును గౌరవించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. ఎల్ఎన్ నగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11, గోల్కొండ క్రాస్‌రోడ్ పరిధిలో 11.30 నుంచి 12, అయ్యప్ప ఆలయం, ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 3, ఫీవర్ ఆస్పత్రి పరిధిలో 3.30 నుంచి 4 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.